జీవనోపాధికి రక్ష

- వెల్లటూరులో పాదరక్షల తయారీ కేంద్రం
- త్వరలో లెదర్ పార్కు ఏర్పాటు
- రూ.6 కోట్లను కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం
- హర్షం వ్యక్తం చేస్తున్న చర్మకారులు



జి.కొండూరులో చెప్పలను తయారు చేస్తున్న చర్మకారుడు

జి.కొండూరు: గత ప్రభుత్వాల నిర్లక్ష్యానికి సజీవ సాక్ష్యంగా మిగిలిపోయిన చర్మకార వృత్తికి పూర్వ వైభవం కల్పించేందుకు ముందడుగు పడింది. అంతరించిపోతున్న సంప్రదాయ వృత్తులు, కళలతో ఎందరో జీవనోపాధి కోల్పోయారు. వారికి భరోసా కల్పించేందుకు ప్రభుత్వం ఇప్పటికే పలు వినూత్న పథకాలను ప్రవేశపెట్టింది. ఈ క్రమంలోనే చర్మకారులకు కూడా భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులను కేటాయించడంపై చేతి వృత్తిదారుల నుంచి హర్షం వ్యక్తమవుతోంది.

రూ.6 కోట్లతో పరిశ్రమ..

ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండల పరిధిలోని వెల్లటూరు గ్రామంలో గతంలో కేటాయించిన స్థలంలో పాదరక్షల తయారీ కేంద్రం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులను కేటాయించింది. ఎస్సీ కార్పొరేషన్ ఆర్థిక సాయంతో లిడ్‌క్యాప్ ద్వారా రూ.6 కోట్లతో ఈ పరిశ్రమను ఏర్పాటు చేయనున్నారు. ఇటీవల విజయవాడలో జరిగిన సమావేశంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున వెల్లడించడంతో ఈ ప్రాంత ప్రజల్లో హర్షం వ్యక్తం అవుతోంది.

ప్రయోజనాలివీ..

లెదర్ పార్కు ఏర్పాటు చేయడం వల్ల ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. లిడ్‌క్యాప్ ద్వారా లెదర్ ఉత్పత్తుల తయారీపై యువకులకు శిక్షణా కార్యక్రమాలు ఉంటాయి. తయారీ, ఎగుమతుల వల్ల లాభాలతో కూడిన వ్యాపారం ఉంటుంది. నియోజకవర్గంలో చర్మకార వృత్తిదారులు అధికంగా ఉండటం వల్ల వారికి లెదర్ పార్కు అందుబాటులోకి వస్తుంది. దగ్గరలోనే శిక్షణ, ఉపాధి దొరుకుతుంది.

గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో..

గత ప్రభుత్వాల నిర్లక్ష్యంతో చర్మకారుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. భారతదేశంలో ఉత్పత్తి అయ్యే మొత్తం ముడిచర్మాల్లో 15 శాతం ఆంధ్రప్రదేశ్ నుంచే ఉత్పత్తి అవుతున్నప్పటికీ లెదర్ వస్తువుల తయారీలో సరైన అవగాహన లేకపోవడంతో వాటి ఎగుమతుల్లో మన రాష్ట్రం కేవలం రెండు శాతానికే పరిమితమైనట్లు ఆయా వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ప్రస్తుత ప్రభుత్వం చర్మకారుల జీవనోపాధిని మెరుగుపరిచేందుకు కృషి చేయడం శుభపరిణామమని చర్మకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పార్కుకు కేటాయించిన స్థలాన్ని ఇటీవల రాష్ట్ర చర్మకార సేవాసంఘం వ్యవస్థాపకులు బుల్లా రాజారావు పరిశీలించారు.



వెల్లటూరు శివారులో పాదరక్షల తయారీ కేంద్రం ఏర్పాటు చేయనున్న స్థలం



త్వరలో ఏర్పాటవుతుంది..

వెల్లటూరు గ్రామంలో పాదరక్షల తయారీ కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రూ.6 కోట్ల నిధులను కేటాయించింది. ఇప్పటికే స్థల పరిశీలన కూడా జరిగింది. అతి త్వరలో పరిశ్రమ ఏర్పడుతుంది. చర్మకారులకు జీవనోపాధి లభిస్తుంది. యువకులకు ఉపాధి లభిస్తుంది.

–బట్టపర్తి రాజు, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు, జి.కొండూరు



చర్మకారులకు పూర్వ వైభవం..

చర్మకారుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టడం శుభపరిణామం. పాదరక్షల తయారీ కేంద్రం ఏర్పాటు చేస్తే పని దొరుకుతుంది. నాలాంటి ఎందరో చర్మకారులు వృత్తిని వదలుకోలేక చెప్పులు కుట్టుకొని జీవనం సాగిస్తున్నాం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

–బి.రవీంద్రబాబు, చర్మకారుడు, జి.కొండూరు



గత ప్రభుత్వం పట్టించుకోలేదు..

పాదరక్షల తయారీ కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టడంతో చర్మకార వృత్తిపై ఆశలు చిగురిస్తున్నాయి. గత ప్రభుత్వాలు పట్టించుకోపోవడం వల్లన నాలాంటి ఎందరో చర్మకారులు ఇతర ఆదాయ మార్గాలను ఎంచుకున్నారు. నా శిక్షణలో ఎంతో మంది చర్మాలతో చెప్పులు కుట్టడం నేర్చుకొని స్థిరపడ్డారు.

–గొదవర్తి భాస్కర్‌రావు, చర్మకారుడు.. జి.కొండూరు

క్లుప్తంగా

రేషన్ పంపిణీలో నిర్లక్ష్యం వద్దు

తిరువూరు: ఇంటింటికీ రేషన్ సరుకుల పంపిణీలో ఎండీఎం ఆపరేటర్లు నిర్లక్ష్యం వహించవద్దని తహసీల్దారు సురేష్‌బాబు హెచ్చరించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన ఎండీఎం ఆపరేటర్లు, రేషన్ డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బియ్యం, పంచదార, కందిపప్పు సరఫరాకు ముందుగానే డిమాండ్ డ్రాఫ్టులు చెల్లించి తమ కార్యాలయంలో అందజేయాలని ఆదేశించారు. వినియోగదారులకు నిబంధనల మేరకు కార్డుపై రావలసిన నిత్యావసర సరుకులను ఇవ్వాలన్నారు. ఎటువంటి అవకతవకలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆధార్ నమోదు కేంద్రం ప్రారంభం



చంద్రాల(మైలవరం): ఆధార్ నమోదు కేంద్రం సేవలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ జొన్నలగడ్డ జ్యోతి తెలిపారు. మైలవరం మండలం చంద్రాల గ్రామ సచివాలయం ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని సర్పంచ్ జ్యోతి ప్రారంభించారు. చంద్రాల గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామ ప్రజల సౌకర్యార్థం అందుబాటులో ఉండేలా ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేశారన్నారు. మాజీ ఎంపీపీ జే గంగాధరరావు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆలయ ఉత్సవాలు ప్రారంభం

రామచంద్రాపురం (విస్సన్నపేట): మండలంలోని కలగర పంచాయతీ రామచంద్రాపురం గ్రామంలో ఉన్న అలివేలు మంగా గోదా సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానం అష్టమ వార్షికోత్సవం ఈ నెల 27 నుంచి మార్చి 1వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. 28న ఉదయం 8 గంటలకు స్వామివారి కల్యాణ మహోత్సవం అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు. పూజలో పాల్గొనే భక్తులు ఆదివారం సాయంత్రంలోపు ఆలయ కమిటీ సభ్యులను సంప్రదించాలన్నారు.

తెగుళ్ల నివారణపై అవగాహన

ఎ.కొండూరు: మండలంలోని కుమ్మరికుంట్ల గ్రామంలో శనివారం వ్యవసాయ శాఖ అధికారులు వరి పంటను పరిశీలించి రైతులకు తెగుళ్లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో టిప్పు సుల్తాన్ మాట్లాడుతూ తెగుళ్ల నివారణకు ట్రైకోడెర్మ, సుడోమోనాస్ బ్యాక్టీరియా మంచి ఫలితాలు ఇస్తున్నాయన్నారు. వరి పంటకు ఆశించే అగ్గి తెగులు, కాండం కుళ్లు నివారణకు సుడోమోనాస్ ఫోరెసెన్స్ మందును లీటర్‌నీటిలో ఐదు గ్రాములు కలిపి పిచికారి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రామచంద్రరావు, రైతులు పలువురు పాల్గొన్నారు.

క్రీస్తు మార్గం అనుసరణీయం



ఆగిరిపల్లి: ప్రతి ఒక్కరూ క్రీస్తు చూపిన సన్మార్గంలో జీవనం సాగించడం ద్వారా సమాజానికి మేలు జరుగుతుందని రెవరెండ్ ఫాదర్ కె.దైవ నిరీక్షణ కుమార్ తెలిపారు. జీసస్ లివింగ్ మినిస్ట్రీస్ పరి చర్యలు 26 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వార్షికోత్సవాన్ని శుక్రవారం రాత్రి ఆగిరిపల్లిలో ఘనంగా నిర్వహించారు. క్రీస్తు చూపిన ప్రేమ, శాంతి, దయాళత్వములను ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలని పాస్టర్ అన్నారు. విశ్వాసులు సమాజంలో ఏ విధంగా మెలగాలో వివరించారు. కార్యక్రమంలో దైవ సేవకురాలు కె.లలిత కుమారి, అభిషిక్త పాస్టర్లు, అధిక సంఖ్యలో సంఘస్తులు, విశ్వాసులు పాల్గొన్నారు.

పాఠశాల వృక్షాలకు రంగులు



ముసునూరు: స్థానిక హైస్కూల్లోని 15 మహా వృక్షాలు (70 ఏళ్ల)కు ఈ పాఠశాలలో సుదీర్ఘ కాలం గణిత ఉపాధ్యాయుడుగా, ప్రధానోపాధ్యాయుడుగా పని చేసి, అక్కడే ఉద్యోగ విరమణ చేసిన వృక్ష ప్రేమికుడు తోటకూర సాంబశివరావు తన సొంత నిధులతో శనివారం రంగులను వేయించడం ప్రారంభించారు. ఎందరో విద్యార్థులు, ఉపాధ్యాయుల సేద దీర్చిన ఈ వృక్షాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు రంగులు వేయిస్తున్న సాంబశివరావును హెచ్ఎం ఎం.శ్రీనివాస్, సహచర ఉపాధ్యాయుడు అల్లాబక్షు, ఉపాధ్యాయులు అభినందించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడండి

సబ్ కలెక్టర్ అదితి సింగ్



పుల్లూరు గ్రామ సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ అదితి సింగ్

పుల్లూరు(మైలవరం): అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు, సచివాలయ సిబ్బంది చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ అదితి సింగ్ ఆదేశించారు. మండలంలోని పుల్లూరు, చంద్రగూడెం, పొందుగల గ్రామాల్లో వ్యవసాయం నుంచి వ్యవసాయేతర భూములు మార్పు నిమిత్తం సబ్ కలెక్టర్ అదితి సింగ్ ఫీల్డ్ విజిట్ చేశారు. రీ సర్వే కు సంబంధించి ప్రభుత్వం చేపట్టిన ఎఫ్–పీఓఎల్ఆర్ ఎటువంటి తప్పులకు తావు లేకుండా చేయవలసిందిగా గ్రామ సర్వేయర్లు, గ్రామ రెవెన్యూ అధికారులకు సూచించారు. మైలవరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను సందర్శించి రోగులకు, గర్భిణులు, శిశువులకు తగు వైద్య సేవలు అందుతున్నదీ లేనిదీ తెలుసుకున్నారు. సక్రమంగా వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులకు సూచించారు. పుల్లూరు గ్రామ సచివాలయాన్ని సబ్ కలెక్టర్ అజయ్ నూపూర్ తనిఖీ చేశారు. ఉద్యోగులు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. రికార్డులు పరిశీలించారు. సంక్షేమ పథకాల వివరాలతో కూడిన సమాచారాన్ని నోటీస్ బోర్డుల్లో ఉంచాలన్నారు. గ్రామస్తులకు సిబ్బంది అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. తహసీల్దార్ ఎం. శ్రీనివాస్, డెప్యూటీ తహసీల్దారు శ్రీహరి, మండల సర్వేయర్లు, సర్వేయర్లు, రెవెన్యూ , సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి కృషి

గంగాధరరావు



గంగాధరరావును సన్మానిస్తున్న సచివాలయ సిబ్బంది, ఎంపీటీసీ సభ్యులు, గ్రామస్తులు

చంద్రాల(మైలవరం): రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానని ఎన్టీఆర్ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు జొన్నలగడ్డ గంగాధరరావు పేర్కొన్నారు. మైలవరం మండలం చంద్రాల గ్రామ పంచాయతీ కార్యాలయం ప్రాంగణంలో ముఖ్యమంత్రి జగన్, మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ఆశీస్సులతో ఎన్టీఆర్ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడిగా నియమితులైన జొన్నలగడ్డ గంగాధరరావును శనివారం ఎంపీటీసీ సభ్యులు, వార్డు మెంబర్స్, సచివాలయ సిబ్బంది, మార్కెట్ శాఖ సిబ్బంది శాలువతో ఘనంగా సన్మానించారు. గంగాధరరావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో ముఖ్యమంత్రి జగన్, ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్‌లు రైతు విభాగం జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించారని, వారి సూచనలు మేరకు రైతులకు అందుబాటులో ఉంటూ సంక్షేమ పథకాలు అమలుకు తన వంతుగా బాధ్యతగా పనిచేస్తానన్నారు. సచివాలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ధాన్యం నిల్వకు అందుబాటులో గోదాములు

ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి



తిరువూరులో మాట్లాడుతున్న నాగనర్సిరెడ్డి

తిరువూరు: రైతులకు అవసరమైన సేవలందించడానికే వ్యవసాయ మార్కెట్ కమిటీ పనిచేస్తుందని తిరువూరు ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి అన్నారు. శనివారం మార్కెట్ కమిటీ పాలకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పొలాలకు వెళ్లే లింకు రోడ్లు, డొంక మార్గాలను ఏఎంసీ నిధులతో నిర్మించడానికి ప్రభుత్వానికి ప్రతిపాదన పంపామన్నారు. వీటికి త్వరలోనే అనుమతి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. తిరువూరు మార్కెట్ కమిటీ పరిధిలోని యార్డులలో రైతులు తమ ధాన్యం నిల్వ చేసుకోడానికి గోదాములు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. గంపలగూడెం, ఏకొండూరు గోదాములకు మరమ్మతులు జరిపిస్తామన్నారు. వైస్ చైర్మన్ చిట్టిబొమ్మ వెంకటేశ్వరరావు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సేవలు అభినందనీయం

లిడ్‌క్యాప్ డైరెక్టర్ కొనేరు సత్యప్రియ

రెడ్డిగూడెం: మథర్ సర్వీసు సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం రెడ్డిగూడెంలో అంతర్జాతీయ ఎన్‌జీవో దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ లిడ్‌క్యాప్ డైరెక్టర్ డాక్టర్ కొనేరు సత్యప్రియ పాల్గొని మథర్ థెరిస్సా చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ ఎన్‌జీవో దినోత్సవాన్ని లాభాపేక్షలేని స్వచ్ఛంద సేవా సంస్థలను, సమాజానికి దోహదపడే వ్యక్తులను గౌరవించుకోవటానికి అంకితమైన రోజుగా అభివర్ణించారు. స్వచ్ఛంద సేవా సంస్థలు కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో అందించిన సేవలు ప్రశంసనీయమన్నారు. అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీసు రమేష్, సర్పంచ్ మల్లాది రాణి, వైస్ ఎంపీపీ చాట్ల రాబర్టు, మథర్ థెరిస్సా ట్రస్టు చైర్మన్ కోయ సుధా, హ్యూమన్ రైట్స్ నేషనల్ ఫౌండర్ బి.దాసు, సేవా రత్న నేషనల్ అవార్డు గ్రహీత మల్లాది ప్రసాదరావు పాల్గొన్నారు.

‘వర్ణాంచిత అంగుళీ విన్యాసం’ గ్రంథావిష్కరణ



చిత్రకారుడు రామకృష్ణను సత్కరిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): కేంద్రీయ విద్యాలయానికి చెందిన కవి, చిత్రకారుడు ఆత్మకూరు రామకృష్ణ రచించి ప్రచురించిన ఫింగర్ పెయింటింగ్ మారథాన్ ‘వర్ణాంచిత అంగుళీ విన్యాసం’ గ్రంథావిష్కరణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. పాఠశాలలో రామకృష్ణ చిత్రకళ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ఫింగర్ పెయింటింగ్ చిత్రకారుడిగా 2010లో 100 చిత్రాలతో రికార్డు సృష్టించినట్లు ప్రిన్సిపాల్ పీవీఎస్ఎస్ఆర్ కృష్ణ తెలిపారు. స్వల్పకాలంలో గ్రంథం రచించడం కళారంగంలో అరుదైన విషయం అన్నారు. కళ ద్వారా ప్రపంచ రికార్డులు సృష్టించాలనుకునే వారికి ఈ గ్రంథం ఉపయోగపడుతుందని పంచాంగ కర్త రవితేజ వివరించారు. రామకృష్ణను ఘనంగా సత్కరించారు.

ఇంటిలో నగదు, బంగారం చోరీ



ఇంట్లో బీరువాను పరిశీలిస్తున్న పోలీసులు

మైలవరం: తాళాలు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి నగదు, బంగారం దోచుకుపోయిన సంఘటన మైలవరంలో జరిగింది. మైలవరం ఎస్వీఎస్ నగర్‌లో నివాసం ఉంటున్న బూరుగుల కిశోర్ శర్మ శుక్రవారం ఇంటికి తాళాలు వేసి మండలంలోని దాసుళ్లపాలెంలో తన తండ్రి ఇంటిలో జరుగుతున్న పూజా కార్యక్రమాలకు హాజరయ్యాడు. దొంగతనం జరిగిన విషయాన్ని చుట్టు పక్కల వారు బాధితుడికి తెలియజేయడంతో ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చాడు. అదే రోజు రాత్రి ఇంటికి వేసిన తాళాలు పగులగొట్టి దొంగలు ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో దాచిన సుమారు రూ.2 లక్షలు నగదు, ఐదు కాసులు బంగారు వస్తువులు దోచుకుపోయారని బాధితుడు బూరుగుల కిశోర్ శర్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఇంటిని, పరిసరాలను పరిశీలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాంబాబు తెలిపారు.

బారికేడ్లకు ఢీకొని వ్యక్తి మృతి



వెంకటాచారి మృతదేహం

జి.కొండూరు: ద్విచక్రవాహనంపై వెళ్తున్న వ్యక్తి బారికేడ్లను ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలలోకి వెళ్తే...కొండపల్లి గ్రామానికి చెందిన వెంకటాచారి (36) ద్విచక్ర వాహనంపై శనివారం రాత్రి 10.30గంటల సమయంలో మైలవరం వైపు నుంచి కొండపల్లి వస్తున్నాడు. కాగా జి.కొండూరు శివారులోని 30వ నంబరు జాతీయ రహదారిపై పినపాక క్రాస్‌రోడ్డు వద్దకు రాగానే రోడ్డు పై ట్రాఫిక్ నియంత్రణకు ఉంచిన బారికేడ్లను ఢీకొట్టాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. జి. కొండూరు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని మైలవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడుకి భార్య,కుమారుడు, కుమార్తె ఉన్నారు.

దోమల నిర్మూలనకు చర్యలు

తిరువూరురూరల్: మండలంలోని పలు గ్రామాల్లో దోమల నిర్మూలనకు వైద్యారోగ్యశాఖాధికారులు చర్యలు చేపట్టారు. రాజుగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి నరసింహ నాయక్ పర్యవేక్షణలో సిబ్బంది మునుకుళ్ల, ముష్టికుంట్ల, వామకుంట్ల గ్రామాల్లో మురుగునీరు నిల్వ ఉండే ప్రదేశాల్లో మలాథియాన్ పిచికారీ చేశారు. దోమలు ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఎంపీహెచ్ఈవో ఎం శ్రీధర్, హెల్త్ విజిటర్ మధుబాల, ముష్టికుంట్ల గ్రామ ఉప సర్పంచి అనిల్ పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవాలి

తిరువూరు: ఇంజినీరింగ్ విద్యార్థులు ఇంగ్లిషు భాషపై పట్టు సాధించడంతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధి చేసుకోవాలని తిరువూరు వాహినీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్. నాగేంద్రబాబు సూచించారు. శనివారం కళాశాల ఈసీఈ విభాగ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు కమ్యూనికేషన్ గ్రూపుల్లో సభ్యత్వం తీసుకుని ఉపాధి అవకాశాలు, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ రంగాల్లో వస్తున్న వినూత్న మార్పులపై ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకోవచ్చన్నారు.

నేడు విగ్రహ ప్రతిష్ఠామహోత్సవం

ఎ.కొండూరు: మండలంలోని కంభంపాడు గ్రామంలో శ్రీ గంగా విజయదుర్గ సమేత శ్రీ నాగమల్లేశ్వరస్వామి వారి దేవాలయంలో ఆదివారం కుంభాభిషేక, విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మండపాంగపూజలు, స్వామివారి దివ్య మహా కుంభాభిషేకం, మహా పూర్ణాహుతి, తిలకధారణ, శ్రీ నాగమల్లేశ్వరి స్వామి, సిద్ధి వినాయక స్వామి, శ్రీ సుబ్రహ్మణ్యస్వామి వారి శాంతి కల్యాణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. కుంభాభిషేక మహోత్సవంలో పాల్గొనాలన్నారు.

నేడు ‘గడప గడపకు మన ప్రభుత్వం’

విస్సన్నపేట: మండలంలోని పుట్రేల గ్రామంలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ శనివారం తెలిపారు. సచివాలయం–2 పరిధిలో రామానగరం, జానలగడ్డ గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి పాల్గొని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తారు. ప్రజల నుంచి సమస్యలు సేకరిస్తారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఆయన కోరారు.

రేపు రామాలయ భూముల వేలం

చాట్రాయి: మండలంలోని చనుబండ కోదండ రామాలయ భూముల కౌలు వేలం ఈ నెల 27న నిర్వహించనున్నట్టు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పుచ్చకాయల చెన్నకేశవరెడ్డి శనివారం తెలిపారు. కౌలు వేలంలో భూములు దక్కించుకున్న వారు అదే రోజు సాయంత్రం 3వ వంతు ధరావతు చెల్లించాలని పేర్కొన్నారు.

డయల్ యువర్ డీఎంకు విశేష స్పందన



ఇబ్రహీంపట్నం: ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణీకుల సమస్యలపై శనివారం నిర్వహించిన ‘డయల్ యువర్ డీఎం’ కార్యక్రమానికి ప్రయాణీకుల నుంచి విశేష స్పందన లభించినట్లు డిపో మేనేజర్ ఏ.సుబ్రహ్మణ్యం తెలిపారు. మైలవరం నుంచి హైదరాబాద్‌కు బస్ సర్వీస్ కావాలని, రింగ్ సెంటర్‌లో కాకుండా బస్ స్టాప్‌లోనే బస్సులు ఆపాలని, విస్సన్నపేట నుంచి మైలవరానికి ఉదయం 8గంటలకు బస్‌సర్వీస్ ఏర్పాటు చేయాలని కోరారు. కొండపల్లి బస్ స్టేషన్ నిర్మాణం, బస్‌స్టాప్‌లలో బస్సుల టైమింగ్స్ బోర్డులు, కొండపల్లి నుంచి విజయవాడ రైల్వే స్టేషన్‌కు 1వ నంబర్ బస్సు నడపాలని కొందరు కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డీఎం శ్రీదేవి పాల్గొన్నారు.

పంచాయతీలకు శ్మశాన వాటికల అప్పగింత



చాట్రాయి: మండలంలోని శ్మశానవాటికలు లేని గ్రామాల్లో శ్మశానాల స్థలాలను ఎంపిక చేసి ఆయా గ్రామ పంచాయతీలకు అప్పగించినట్టు ఎంపీడీఓ ఎస్.మురళీమోహనరావు తెలిపారు. మండలంలోని సోమవరం, ఆరుగొలనుపేట, చాట్రాయి, తుమ్మగూడెం, కొత్తగూడెం, నర్సింహారావుపాలెం గ్రామ పంచాయతీలకు శ్మశానవాటికల బాధ్యతలను అప్పగిస్తూ పత్రాలను అందజేశామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విశ్వనాథరావు తదితరులు పాల్గొన్నారు.

ఐటీ వింగ్ బలోపేతానికి కృషి చేయాలి



ఇబ్రహీంపట్నం: వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా ఐటీ వింగ్ అధ్యక్షుడిగా నియమితులైన ఇబ్రహీంపట్నంకు చెందిన నల్లమోతు ప్రసన్నబోసు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్‌ను మర్యాద పూర్వకంగా శనివారం కలిశారు. ఈ సందర్భంగా ప్రసన్నబోసును మంత్రి జోగి రమేష్ ప్రత్యేకంగా అభినందించారు. జిల్లాలో పార్టీ ఐటీ వింగ్ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం పార్టీ నాయకులు జోగి రాము, రాష్ట్ర సహాయ కార్యదర్శి మేడపాటి నాగిరెడ్డి తదితరులు బోసును శాలువా కప్పి పూల మాలలతో సత్కరించి అభినందనలు తెలిపారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

28లోగా లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలి

నూజివీడు: ప్రభుత్వ పింఛన్‌దారులు ఈనెల 28లోగా నూజివీడు ఉప ఖజానా కార్యాలయంలో తమ లైఫ్ సర్టిఫికెట్లను అందజేయాలని ఏపీ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం నూజివీడు ప్రధాన కార్యదర్శి బండారు సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉపఖజానాకార్యాలయం పరిధిలో మొత్తం 1709 మంది ప్రభుత్వ పింఛన్ దారులుండగా ఇప్పటి వరకు 1440 మంది తమ లైఫ్ సర్టిఫికెట్లను సమర్పించారని, మిగిలిన వారు కూడా సమర్పించాలని తెలిపారు. కార్యాలయానికి రాలేని పరిస్థితిలో ఉన్నవారి ఇళ్లకు వెళ్లి ఫేస్ యాప్ ద్వారా ధ్రువీకరణ పత్రం ఇస్తున్నారని పేర్కొన్నారు.